

'కరిమేన్' యనువాడు ముసలివాడు అటునిటు చూచెను......అందరూ నేలపై చదికిలబడిరి.

# అవి యుద్ధపురోజులు

చింతలపాటి వెంకట (శ్రీ)రాములు, బి. ఏ., యల్. టి.

అవి యుద్ధపురోజులు. యెక్కడ లేనిజనము నశింపు. ఒకప్రక్కను యుద్ధము; అది ఆగిందో లేదో కాటకం. యుద్ధముమనము ప్రత్యక్షంగా చూళ్లేదుగాని సీమసరుకులధరలు మండిపోయినాయి. ఆరురూపాయలు, యేడురూపాయిలు అమ్మిన 1702మల్లు, తాను యిరవై, యిరవైరెండు అమ్మింది. పెట్టెలనిండా గుడ్డలుంచుకుంటూ, అయిదేసిజోళ్లు, ఆరేసిజోళ్లు, మల్లులు, డజనుకు తక్కువలేకుండా ట్వీల్లు షర్టులు వుండేవాళ్లకుకూడా యేజోటితోనో సరిపుచ్చుకోవలసి వచ్చినది. పూటకు మూడు చీరెలువిడిచే పువ్వుబోణులు యేమూడింటితోనో కాలక్షేపముచేసిన పాపిష్ఠికాలమది. మగవాడు యెంత గుడ్డతోనైనా మానుషము కాపాడుకుంటాడుగాని స్త్రీలు సిగ్గు దాచుకోవలెనంటే కనీసం ఆరుమూళ్లగుడ్డయినా కావాలె. ఆరోజుల్లో పాటకజనంలో ఆడవాళ్లను చూడలేక సిగ్గయ్యేది. జనము మానుషానికి మగ్గిపోయినారు. ఆకాటకంమాటలు తలుచుకుంటే గర్భనిర్భేద మవుతుంది. శ్రీమంతుల మనుకునేవాళ్లు డబ్బుకు కిటకిటలాడారు. బీదవాళ్లు అంభోఅని అడలిపోయినారు. మధ్యరకం పడ్డపాట్లేనా! అసలే మంచి రోజుల్లోనే ఒక్కపూటకైనా కడుపునిండా గంజితాగడానికి నోచుకోక, చావుకు మొగము వాచి, ఆరుకోట్లమంది అల్లాడే దేశము. ఇట్లాంటిపాడుకాలములో వాళ్లమాటయేమిటి? ఏనుగులవంటివాళ్లు పీనుగులైపోయినారు. ఆలికి మొగుడులేదు; తల్లికి పిల్లలేదు; ఒక్కపూట కడుపునిండా భోజనంబెట్టి కట్టుకొనుట కొక

కోకయిచ్చిన, కడుపారగని చేతులార నైదేండ్లు ఆరేండ్లు పెంచిన ముద్దుబిడ్డలను కడుపుతీపు కడకుత్రోసి పరులపాల్జేసిన తల్లులను ప్రత్యక్షముగా యెరుగుదుము. ఇట్టి పరిస్థితిలో కంట్రోలు పద్ధతి యేర్పాటు చేసి ప్రభుత్వము వారు కొంత సహాయపడ్డారు. దానివల్ల ప్రజలకు ధాన్యము దొరకడముకు సౌకర్యము యేర్పడ్డది. ఉద్యోగస్థులకు సంపాదించుకోటానికి మార్గము కనపడ్డది. యెన్ని వసతులు చేసినా డబ్బు మెదలుతుంటే గాదూ! కలవాండ్లగాదెలు తెరిచేసరికి బీదవాళ్ల ప్రాణంపరి పోతుంది. 'ఎల్లకాలము యిలా వుండబోదు. కఱువుపోయి కాలము కాగానే, రెక్కల కష్టముమీద మీ ఋణము తీర్చుకుంటాము బాబయ్యా' అంటే నమ్మి యిచ్చువాడెవ్వడు? దోపిళ్లు జరిగినవని, జరుగనున్నవని పోలీసు ఠాణాలకు ఒకటే రిపోర్టు.

వడ్డెర వెంకడిది మంచి మర్యాదగల కుటుంబము. వాడితాత మూర్తిగాడి కాలములో వాండ్లకు రెండువందల యెకరం మెరక వుండేది. అయిదు గాండ్ల యెద్దులు, ఒకవంద పశువు, ఒకవెయ్యి జీవం (మేకలు, గొర్లు); యింటిముందర పాతరలు, పాడిగొడ్లు, యింట్లో పసిపిల్లలు, పాడికుండలు. వెంకడితండ్రులు ఆరుగురు అన్నదమ్ములు. వెంకడి తండ్రికి నలుగురు. వెంకడి పెళ్లాము కంటూ పెంచుతూ వున్నది. దుర్యోధనసంపత్తి; కుటుంబము భారమైనది. భాగాలు యెక్కువైనాయి. అతివృష్టి అనావృష్టి పంటలు తిన్నగా పండటం లేదు. పశువులజాడ్యాలు ప్రబలినాయి. కాని కాలములు దాపరించాయి. సంసారము ఋణముల పాలయింది. అప్పు ఆస్తికి మించిపోయింది. బాకీదార్లు గాచుకుంటారా? అప్పులవాళ్లకు అంతా కట్టిపెట్టి ఆ గ్రామములోనే కాపురం చేయడమా! పూలమ్మిన వీథినే పుల్లలమ్మడము! ఆహాహా! రోజులమహిమ వెంకడిక హనుమంతుపాలెంలో వుండలేకపోయినాడు. నలుగురిలో తలయెత్తుకోని తిరుగడం యెలాగా? యెన్ని తరాలనుండి తమ పూర్వులు అక్కడ కాపురం చేశారో, యే యింట్లో తాము, పిల్లలు యింత కాలము సుఖముగా నుండిరో, ఆ యిండ్లు, స్థలాలు అప్పులక్రింద వప్పగించి, ఒకనాటి తెల్లవారుజామున బయలుదేరి, వెంకడు పెళ్లాము పిల్లలతో బండిపాలెము ప్రవేశించాడు.

యుద్ధము జయప్రదముగా ముగిసిందన్నారు. విజయమును — చేశారు. సంధి షరతులు బంధించారు. ఉత్సవాలు సాగించారు. కాని మన వెక్కడి సంతోషము? ఒకపక్కని క్షామదేవత బలులుగోరుతున్నది. ఒకపక్క యిన్ఫ్లుయెంజా పీల్చి పిప్పిచేస్తున్నది.

కాసవిక్రాంతుం తల దాచుకోవలెనని వెంకడు బండిపాలెము వచ్చాడేకాని వానికి జీవనోపాధి? యేమిగ్రాళ్లు? రేగికాయకాయలు! అయిదు మానికల జొన్నబియ్యము వుడకబోస్తే అందరికి అంతంత మాత్రముగా సరిపోయ్యే యిల్లు. వెంకడు యేమి చేస్తాడు? కొడుకులు యెదిగి చేతికివచ్చారు. కూలి నాలి చేసుకుందామంటే పిలిచేదక్కు కనపడడు. మడతకుడుములు దిని, కడుపులోకి కాళ్లు ముడు

చుకొని పడుకోవడం వెంకడు వాడిపిల్లలు యింతవరకు యెరుగరు. వెంకడిపెళ్లాము అచ్చికి కుచేలుని భార్య వామాక్షికి వచ్చిన పాట్లు వచ్చాయి. పిల్లలగోడు చూడలేకపోయినాడు వెంకడు. కొడుకులు తాను కష్టము చేసుకొని జీవనం చేతామంటే మార్గం కనబడలేదు. యెక్కడో మునగాలపరగణాలో కరువుపనులు ప్రభుత్వమువారు ప్రారంభించారు అన్నారు. యెక్కడి కెక్కడ? అలాంటి పనులు వారి కొకటిసాగించినా తీరదు గోడు. యిక వెంకడు వాడి కొడుకులు దారిదోపుడుగాండ్రుగా మారవలసిన దే! బందిపోటుదొంగలుగా ప్రబలవలసిన దే? కన్నపుకత్తి కరమునందు ధరించవలసిన దే!

మనకు తలవంపులు, మన ప్రభుత్వమునకు అగ్గపాట్లు తప్పకుండా, దయామయులు మన దేశీయుల కొందరిని నేరములు చేయుజాతుల (Criminal Tribes) క్రింద బారవేసి, క్రైస్తవ మతసంఘాలకు వప్పగించారు. వెంకడు వడ్డెర కులములోనే పుట్టాడుగాని తరతరములనుండి వ్యవసాయము చేసుకొని మర్యాదగా కాలక్షేపము చేసినవాడు. ఆ నేరములు చేయు నేర్పు, ఆ కన్నములవేయు కౌశల్యము, ఆ మెడల లోవి తెంచుకునే మెలుకువ, గొంతులుకోయు క్రౌర్యమూ యీ వాడున యెట్లలవడుతాయి?

బండిపాలెము కురవలో (కొండకనుమ) బందిపోటుమూక వున్నదన్నారు. యెవరో పెండ్లివాండ్లకు తగిలారనుకున్నారు. పోలీసు స్టేషనుకు రిపోర్టు రానేవచ్చాయి. ఒకబ్రాహ్మణుడు అవతలివూళ్లో సత్యనారాయణ వ్రతముచేయించి వస్తూ విఘ్నేశ్వరపూజ మంటపారాధన బియ్యము, దక్షిణలు, స్వామివారి ప్రసాదము మూటగట్టకున్న గావంచా (కొల్లాయి) దాన్లోబెట్టి, లఘుశంకానివృత్తి చేసికొని తరువాత దిగుడుబావి రెండువందల మెట్లుదిగి, పాదప్రక్షాళనానంతరం, ఆచమనం చేసి, తిరిగి పైకివచ్చి చూచుకుంటే ప్రాణపదమైన గావంచా పొడగాన రాకుండాపోయింది. బ్రాహ్మడు కుప్పవలె కూలి పోయినాడు. సర్కిల్ యినస్పెక్టరుగారు బ్రాహ్మణ ప్రభువు. శాస్త్రుల్లు వారికి వార్షికంగూడా వున్నది. వెళ్లి చెవిని వేయనే వేశాడు.

వెంటనే సబుయినస్పెక్టరు నాయుడుగారు, పదిమంది పోలీసులు చుట్టుప్రక్కల గ్రామాదుల యెరుకలయానాదిజనము, అట్టహాసముగా వెళ్లి వారిమీదబడ్డారు. ఎలాగో తప్పకోవలె గ్రామస్థులు; అందుకని సక్రమముగా వేటపోతులు, కోళ్లు, సారాబుడ్లు మొక్కుబళ్లు (నైవేద్యం) చెల్లిన తరువాత, కొత్తవాండ్లు-వడ్డెరకులము-నిరాధారులు-యేనుగులవంటివాళ్లు! బాగున్నది- వెంకణ్ణే వాడికొడుకుల నిద్దరిని వాడి అల్లుణ్ణి పెట్టమన్నారు. తహశీల్‌దారు-మేజస్ట్రేటు (ఒకటే వ్యక్తి) కేసు సెషన్సుకు కమిట్ చేశాడు.

విచారణలో హనుమంతుపాలెం, సోమేశ్వరపురం గ్రామోద్యోగస్థులు, మోతుబరి రైతులు, సర్కారుకు యిన్‌కంటాక్సు కట్టే షాహుకార్లు, వెళ్లారు, సాక్ష్యాలు చెప్పారు వెంకడి తరఫున; మర్యాదస్థుడన్నారు. మొన్న

టివరకు పెద్దరైతన్నారు. జడ్జీగారికి అవన్నీ అక్కరలేదు. వాళ్లది వడ్డెరకులం. మనుష్యులు మాగధమహిషముల లాగున్నారు. వీళ్లను విడిచిపెడితే అందరికి అలుసు అవుతుంది. అల్లరి మూకలకు హడలుపుండదు అన్నారు. ఆరేసి సంవత్సరములు వేశారు. వెంకడికి వెంకట్రాయుడుగారిని శామ్యూలుగారిని బెట్టుకోవడానికి శక్తి లేకపోయింది.

యీ కేసు వచ్చినప్పటినుంచి వెంకడు ప్రజలలో లేడు. వయసులో వెంకడు చెవికి జంపు, మెల్లో వెండిపెళ్లల మొలతాడు, శేరుశేరు వెండిమురుగులు చేతులకు బెట్టుకోని, కట్టమీద వెళ్తుంటే కాలితగరపు కుచ్చులజోడు కిర్రు చప్పుళ్లకి వినవస్తుండేది. ఏమైన దాసామంతము? రోజులమహిమ! కొయ్యయిపోయినాడు. వానిదృష్టికి ఆవిచారణస్థలము, అందలి విచారణకర్త, ఆపడివాదులు, మరియితరులూ యెవ్వరూ కనిపించడం లేదు.

కోర్టును న్యాయస్థానములనటం, జడ్జీను న్యాయమూర్తులనటం. మీదు మిక్కిలి ప్లీడర్లను న్యాయవాదులనడం-ఆస్థానములకు ఆవ్యక్తులకు అపచారం చెయ్యడం-వ్యక్తిని మూలచ్ఛేదముచేయడం. నిజానికి యింగ్లీషుముక్కలే బాగున్నవి. వానిలో యీన్యాయం అన్యాయం గొడవ లేనేలేదు.

అందుకనే "జడ్జీగారు ధర్మప్రభువులు జాలిగుండె చెప్పకో" అని పక్కవాళ్లన్నప్పుడుగాని 'నిన్నెందుకు కఠినముగా శిక్షించకూడ'దని శ్రీవారు గద్దించినప్పుడుగాని వెంకడు దారువు వలె నిలబడ్డాడు. వానిధ్యాసంతా యెక్కడనో పన్నెండామడ దూరాన చుట్టుగుడిసెలో వున్నవాడి ముసలిదానిమీద పిల్లలమీద వున్నది. కడగొట్టుపిల్ల గుడివి. మూడోయేడు ముండకు. తండ్రి మాలిమి. బుజము దిగేదిగాదు. వాళ్లకు దిక్కెవరు? ఆమాట తలపుకు వచ్చినప్పుడు వెంకడు నీరయి పోయినాడు. 'యేజన్మలో తండ్రికి పిల్లలను యెడబాపానో!'

భగవంతునికి దయాదాక్షిణ్యములు గొడవ వున్నదా? వానిసృష్టిలో చిన్నజంతువును పెద్దజంతువు; వాటినన్నింటినిగాకుండా మనుష్యులు ఒకరినొకరు పీక్కుతినడం గనపడుతుంది. అందుకనే మన వేదాంతులలో పైమెట్టెక్కినవారు యీశ్వరుణ్ణి నిర్గుణుడన్నారు. మరి యీచిత్రక్షోభంతా యెందుకు? యీ నాటకానికి చమత్కృతి యెవరిది? కాలచక్రము మట్టుకు విసుగు విరామము లేకుండా గిరక తిరిగిపోతున్నది. అదృష్టవంతులు ఆ చక్రనేమిపై నిలుచబడి సర్కస్‌లో ఫీటు చేసి సట్టాగా కేరింతలు కొట్టుచున్నారు. అదృష్టహీనులు అధోభాగమునబడి వ్యథలపాలగుచున్నారు. ఆ యానందమునకు యీవనటకు యోగ్యతాయోగ్యతలు కారణములుగా గనపడవు. యిక కర్మము-ప్రారబ్ధము-పూర్వజన్మసంచితం-దీనికి మొదలూ తుదా యేమిటి? పరమావధి యేదో-సారూప్యమో, సాయుజ్యమో, యేమేమో-చెప్పేవాళ్లకు కొంత తేలికేగాని, పునాదిలోనే వున్నది బాధంతా. ప్రారంభం యెక్కడ? విత్తు ముందా చెట్టు

ముందా? సరియైన సమాధానం చెప్పాలంటే చావు దగ్గరకు వస్తుంది.

డబ్బయి రెండు నెలలూ యెలాగో గడిచి పోయినాయి. దానికేమిటి? యుగములు గడిచి పోయినవి. కష్టములు కలకాలము వుండవు. ఆపదలు కాపురాలు చెయ్యవు. అమావాస్య నాడు కటిక చీకటి; పౌర్ణమినాడు వెండి వెన్నెల. వెంకడు, వాడి కొడుకులు, అల్లుడు విడుదల అయినారు-పాపము యీ ఆరుసంవత్సరములలో అంతా ఒకచోట వుండి ఒకరి కొకరు ధైర్యము చెప్పుకునేందుకైనా లేకుండా దేశానికొకరై పోయియుండిరి.

కాలుచేతులనుండి సంకెలలు పడిపోవ డంతోటే వెంకడి హృదయములో నిక నిస్పృహా, నిరాశయను పెనుభూతములకు చోటు లేదు. ఒక్కసారిగ జాలి, అనురాగము వాని శూన్య హృదయమును జొచ్చి నిండి వెల్లి విరియబారెను. వెంకడు అట్టె పెళ్లాముపిల్లల దలచుకొని అడుగు వేయలేకపోయినాడు. గురివి, తన ముద్దులగురివి. వరాలమూట, మూడేళ్లదాన్ని విధిలేక విడిచిపెట్టిపోయినాడు.

అచ్చి, పిల్లలు యిప్పుడు బండిపాలెము లో లేరు. జగ్గయ్యపేటనుండి కృష్ణాతీరమున నున్న వేదాద్రి క్షేత్రమునకు రోడ్డువేయడం కరువుపనులలో ఒకటి. తాను, కూతురూ చెరి రెండణాలు తెచ్చుకొని కరువు గడుపుతూ, అమాసాలు పున్నాలు లెక్కపెట్టుకుంటూ, అమ్మవారికి వెర్రి మొక్కులు మొక్కుతూ వున్నారు. యింతలో కాటకం పోయింది. కాలమయింది. కోతవేత, కూలినాలి దొరుకు తున్నది. నవాబుపేటలో బతుకుతున్నారు.

కాముడిపున్నమి ముందు ఒకనాడు వుదయం ఝాముప్రొద్దెక్కింది. అచ్చి గంజి దాగి కాళ్లకు పసుపురాచుకొని, మొగాన డబ్బ నపల్పున కుంకుమబొట్టుపెట్టుకొని మెడకుముంజేతులకుగంధముబూసుకొని-అచ్చి కాపురానికి వచ్చిందది మొదలు దరిద్రములోనైనా యివి యెన్నడూ మాని యెరుగదు- గుడ్డ, కొడవలి తీసికొని గుమ్మములోకి వచ్చింది. కరణముగారికి దినం గడ్డిమూటవేస్తే నెలకు రెండురూపాయీలు యిస్తారు. ఒకముసలివాడు యేమో వెదుక్కుంటూ ముందు, వెనుక తలవంచుకొని ముగ్గురుపడుచు వాళ్లు మొత్తలోకివచ్చి నిలువ బడ్డారు. అట్టేచూచి ముసలివాడు గద్గద సర్వ ముతో నేమోగొణిగికొన్నాడు. అచ్చి వచ్చిన వాళ్లనుచూస్తూ నిలువబడి పోయింది. గుడ్డ, కొడవలి తమంతటజారి పడిపోయినవి. కన్నుల వెంట నీరు కాల్వలు గట్టుచుండెను. యింతలో కొడుకులు తల్లిదగ్గరకు వచ్చిరి. 'గురి వేదీ'యనుచుముసలివాడు అటునిటుచూచెను. అచ్చిగుండె వ్రక్కలయిపోయెను. అందరూ నేలపై చదికిలబడిరి. తండ్రి బెంగతో, తిన్నగా కారంమెతుకులైనా, ఒక్కొక్కనాడుగంజిగుటకైనా, లేకపోవడంతో గుమ్మటమువలెనున్న గురివి చిక్కిశల్యమయి యెన్నడో దాటిపోయింది కష్టసుఖాలు యెరక్కుండా. ముసలి వాడు తనలోతాను గొణుక్కుంటాడు. తల ఆడిస్తా డప్పుడప్పుడు. కూతురు దగ్గరవచ్చి కూర్చున్నది. ఒకపాటికి ప్రజల ధోరణిలోకి వచ్చాడు.

కళ్లు చూసుకునే రోజులు వస్తున్నవిగదా యని బానలో దాచుకున్న కూలిగింజలు దీసి దంచి వుడకవేసి అమ్మవారికి పసుపుకుంకుమ నైవేద్యము బెట్టి, అందరు ఒక్కమారుగా సానికలలో బెట్టుకొని కష్టసుఖాలు చెప్పుకొంటూ అన్నాలుదిన్నారు. కమ్మవారి కాంతమ్మగారు ముంతెడు చిక్కనిమజ్జిగ, పెట్టెడు వుల్లిపాయ వేసినూరిన గోంగూర పచ్చడి పెట్టింది. మొకదుమటుకు చెక్కమొగి చేసుకున్నాడు. గురివేది, వానిపొట్టిలో నూచునేది? కులపువాళ్లు వచ్చారు, ఇరుగుపొరుగు వచ్చారు. వెంకణ్ణిఓదార్చడానికి.

ఆరోజు మొదలు ప్రతిరాత్రి బీటు పోలీసు రావడం కేకవెయ్యడం. వెంకడు 'హాజరయ్యా' అనడం; గ్రుడ్లపిల్లు గ్రుక్కుకోవడం. కొడుకులు రెక్కలమీద జీవనం చేస్తున్నారు. పెండిండ్లు అయినాయి. ఒకజత దున్నపోతులను సంపాదించుకున్నారు. బ్రాహ్మల యినాములు మక్తాకు తీసికొని వ్యవసాయం చేస్తున్నారు. పొట్టకు, అప్పుకి కష్టాలు గడిచిపోయినవి. కాని వెంకడికి మాత్రము పోచ నియ్యాను దింపుకున్నా, దోసకాయ తెచ్చుకున్నా, గురివిన్యాసము రాకమానదు. ఉత్తరియ్యము (పైబట్ట) చెంగుతో కండ్లు తుడుచుకోకమానడు.

సంపూర్ణము

# ప్ర తీ క్ష

"వి ద్యా ర్థి"

శ్రవణములఁ జేరవచ్చు నీ శ్రావ్యలోక
మోహకర వేణునిక్వణముగ్ధగీతి
మానసము పుల్కరింప ననూనవాంఛ
శ్రవణమాయెఁగ నిశ్శబ్ద సరణిఁ దోఁచు.

ఘ్రాణమునఁ జేరినట్లౌ నవీనవికచ
దామనిర్యాత పరిమళోద్దామమనఘ
అల్లిబిల్లిగ భావము లల్లుకొనఁగఁ
బూని యుచ్ఛ్వాసమొనరింపఁ బోల్పలేదు.

కంటఁ బడినటులౌను నీకామనీయ
మేదురోజ్జ్వల సుస్నిగ్ధ మృదులమూర్తి
కోర్కెలీరికలెత్తఁగాఁ గోరి కన్ను
దోయి తెఱచినతోడనే మాయమౌదు.

దేహమున సోకినటులైన దివ్యనూత్న
మృదుల నీరేజనేత్ర సమ్మృష్టకరము
పల్లవింపఁగఁ దలఁపులు బాహుయుగము
సాచిపదకి బయళ్లని సంభ్రమింతు.

నమ్మి నిర్మల ప్రేమపూరమ్ము దలఁచి
నవ్యభావోదయమ్ము లనంతములుగ
నెమ్మితో భవదాగమనమ్ముకొఱకు
గాంచితిని కృష్ణ, నీదయఁ గాంచనైతి.